

'అభయ'మిస్తున్నారు..!

పోలీసు కమిషనరేట్ పరిధిలోని ప్రతీ ఆటోకు యూనిక్ నంబరు కేటాయించారు. యాప్ ద్వారా డ్రైవర్ సీటు క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే వివరాలు తెలుస్తాయి. 8లో▸



బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. గురువారం ఆయన కన్నెపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం

32.0 /25.0

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. పడమర దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

ఎఫ్‌డీవో బాధ్యతల స్వీకరణ



మాధవరావు

జన్నారం: జన్నారం డివిజన్ ఫారెస్ట్ అధికారి సిరిపురం మాధవరావు గురువారం తిరిగి బాధ్యతలు చేపట్టారు. గత నెల ఆయన సొంత పనుల నిమిత్తం సెలవుపై వెళ్లిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ అడవుల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణ కోసం నాలుగేళ్లుగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్వంత పనులు ఉన్నందున సెలవు వెళ్లినట్లు తెలిపారు.

మద్యం టెండర్లకు నేడే ఆఖరు



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎక్సైజ్ సీఐ

మంచిర్యాలక్రైం: ఈ ఏడాది కొత్త మద్యం పాలసీ నిర్వహణకు ఎక్సైజ్ శాఖ ఈ నెల 4నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. జిల్లాలో 73 మద్యం దుకాణాలకు గాను గురువారం వరకు 971 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి కేజీ నందగోపాల్ తెలిపారు. మద్యం టెండర్ల దాఖలుకు ఈ నెల 18 చివరి రోజు కావడంతో అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. జిల్లాలోని ఎక్సైజ్ శాఖ అధికారులు జిల్లా కార్యాలయంలోనే పూర్తి స్థాయిలో దరఖాస్తుల స్వీకరణలో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది కాలంపాటు ఎన్నికల నిర్వహణ ఉన్నందున ఎలాగైనా మద్యం దుకాణం దక్కించుకోవాలని ముహూర్తాలు చూసి మరీ దరఖాస్తులు సమర్పిస్తున్నట్లు సమాచారం. శుక్రవారం చివరి రోజు దరఖాస్తుల సమర్పణకు అధికంగా తరలివచ్చే అవకాశం ఉండడంతో అధికారులు అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేశారు.

సాగు నీరందించాలని ధర్నా



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

లక్సెట్టిపేట: కడెం ప్రాజెక్టు సాగునీటిని లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో పంటలకు 37, 42 డిస్ట్రిబ్యూటరీల ద్వారా అందించాలని బీజేపీ ఆధ్వర్యంలో రైతులు గురువారం స్థానిక ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో కూడా పంటలకు సాగు నీరందించడం లేదని, 900 క్యూసెక్కుల నీరందించాల్సి ఉన్నా 700 క్యూసెక్కులు మాత్రమే అందిస్తున్నారని, దీంతో చివరి ఆయకట్టు వరకు అందక సాగుకు నోచుకోవడం లేదని తెలిపారు. పూర్తి స్థాయిలో సాగునీటిని అందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఈ దశరథ్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు, కిషన్, ప్రభాకర్, వేముల మధు, రవి, సత్తన్న, చిన్నయ్య పాల్గొన్నారు.

మెప్మా ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపు



మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌ను కలిసిన మెప్మా ఉద్యోగులు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీల్లో పేదరిక నిర్మూలన మిషన్(మెప్మా) ద్వారా నియమించిన కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పేస్కేల్ వర్తింపజేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో మొత్తం 16 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వివిధ హోదాల్లో పనిచేస్తున్న వీరిని రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా గుర్తిస్తూ పేస్కేల్‌ను రూపొందించి ఈ నెల 11న ఉత్తర్వులు జారీ చేయడంపై మెప్మా ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని టౌన్ మిషన్ కోఆర్డినేటర్(టీఎంసీ) ముగ్గురు ఉండగా, వారిని సీనియర్ అసిస్టెంట్‌గా, డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఇద్దరు, 11 మంది సీఈవోలను జూనియర్ అసిస్టెంటుగా, ఒక అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్(ఏడీఎంసీ)ని కామన్ అసిస్టెంట్‌గా పరిగణిస్తూ వారికి కొత్త పేస్కేల్‌ను అమలు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంచిర్యాలలో ఉద్యోగులు మున్సిపల్ కమిషనర్‌ను కలిశారు.

గులాబీ నేతల్లో ఫస్ట్‌లిస్ట్ గుబులు



- టికెట్ల ప్రకటనపై ఉత్కంఠ
- రోజులు గడిచేకొద్దీ టెన్షన్ టెన్షన్
- పలు స్థానాల్లో మార్పులంటూ ప్రచారం
- నాయకులకు ప్రగతిభవన్ నుంచి పిలుపు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలోని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల్లో టికెట్ టెన్షన్ నెలకొంది. రోజులు గడుస్తున్న కొద్దీ ఉత్కంఠ పెరుగుతోంది. జిల్లాలో ఒకట్రెండు చోట్ల మార్పు తప్పదనే సంకేతాలు వస్తుండడంతో ఆ స్థానాల్లోని ప్రజాప్రతినిధులకు శిరోభారం పెరిగిపోతోంది. జిల్లాలో మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి శాసనసభా స్థానాలు పూర్తిగా, ఖానాపూర్ నియోజకవర్గం జన్నారం మాత్రమే ఉంది. ఈ నాలుగు అసెంబ్లీ స్థానాల్లో నియోజకవర్గ పార్టీ నేతల టికెట్ల ప్రకటన వెలువడే వరకు ఆ పార్టీ శ్రేణులు, ఆశావహుల్లో ఒకింత ఆందోళన తప్పేలా లేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేలతోపాటు ఆశావహులకు ప్రగతిభవన్ నుంచి పిలుపు రావడం, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు మంతనాలు జరపడం టికెట్ల ఎంపిక ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది.

చెన్నూరులో సుమన్

ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌కు చెన్నూరులో మరోసారి అవకాశం లభిస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. అయితే ఆయన తన స్థానం మార్చుకుంటే ఇతరులకు చోటు దక్కనుంది. ఇప్పటికైతే సుమన్ ఇక్కడి నుంచే పోటీకి ఆసక్తిగా ఉన్నట్లు చెబుతున్నారు. మారుతున్న సమీకరణాలతో పార్టీ అధిష్టానం తన స్థానం మార్చి, పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోనే మరో చోటుకు వెళ్లాలని ఆదేశించే అవకాశాలు లేకపోలేదని పార్టీ వర్గాలు అంటున్నాయి. అధికారికంగా ప్రకటన వస్తేనే స్పష్టత రానుంది.

సర్వేలు, ఫలితాలే ఆధారం

సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మళ్లీ టికెట్ల కేటాయింపుల్లో సర్వేలే కీలకంగా మారాయి. అభివృద్ధి, ప్రజల్లో సానుకూల ధోరణి, మరోసారి గెలుస్తారనే ఫలితాల మేరకే టికెట్లు కేటాయింపులు జరుగుతున్నాయి. జిల్లాలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకుల సర్వే జాతకాలు గులాబీ పార్టీ అధినేత సీఎం కేసీఆర్ వద్ద ఉన్నాయి. వీరికి గెలిచే సత్తా ఉందా? మళ్లీ అవకాశం ఇస్తే పార్టీకి లాభమా? నష్టమా? ఇక వారిని పక్కకు పెడితే బుజ్జగింపులు, ప్రతిపక్ష పార్టీల్లో అభ్యర్థుల బలాలు, బలహీనతలు తదితరవన్నీ బేరీజు వేసుకునే జాబితా సిద్ధమైంది. అధికారికంగా పేర్లు ప్రకటించే వరకు గులాబీ నేతల్లో గుబులు తప్పేలా లేదు.

మంచిర్యాలపై తలోమాట

జిల్లాలో కీలకమైన మంచిర్యాల స్థానంపైనే అందరి చూపులు ఉన్నాయి. ఇక్కడి అభ్యర్థిని మార్చుతారనే ప్రచారం పార్టీ శ్రేణుల్లో జరుగుతోంది. సీనియర్ నాయకులు, సిట్టింగ్ ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావును మార్చు తప్పనిసరైన క్రమంలో తన తనయుడు విజిత్‌రావు సైతం టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. గత కొద్దిరోజులుగా గ్రామాల్లో పర్యటిస్తున్నారు. తండ్రి, తనయులు ఇద్దరినీ కాదని మరొకరి అవకాశం ఇస్తే వెలమ సామాజిక వర్గం నుంచే ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పుస్కూర్ రామ్మోహన్ రావు నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ఆయన కాకుండా ఇతరులెవరైనా అనుకుంటే మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, బీసీ నినాదంతో మున్సిపల్ వైస్‌చైర్మన్ ముఖేశ్‌గౌడ్, పల్లె భూమేశ్, అక్కల తిరుపతివర్మ, తదితరులు ఆశలు పెట్టుకున్నారు.

బెల్లంపల్లిలోనూ ఉత్కంఠ

సిట్టింగ్ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై ఆరిజిన్ డెయిరీ వ్యవహారం వివాదాస్పదమైంది. ఆయన సీటుపై ప్రభావం చూపుతుందా? అనే చర్చ పార్టీలో సాగుతోంది. ఇక్కడ కూడా కొత్త వారికి అవకాశం చోటు ఉండొచ్చనే అభిప్రాయాలు వస్తున్నాయి. ఈ సీటుపై ఆశలు పెట్టుకున్న జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్‌కుమార్ టికెట్ రేసులో ఉన్నారు. తనకు అవకాశం ఉంటుందనే నమ్మకంతో ఉన్నారు. ఇక ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్‌పై వ్యతిరేకత కారణంగా ఇక్కడ కూడా ఎంపికలో ఆచితూచీ వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ స్నేహితుడు జాన్సన్‌నాయక్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఈయనతోపాటు ఆదిలాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ రాథోడ్ జనార్దన్, మరో నాయకుడు పూర్ణ చందర్‌నాయక్ ఉన్నారు.

సివిల్ 'కాసు'పత్రి..!

- డబ్బులు వసూలు చేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది..
- ఇబ్బందుల్లో రోగులు.. పట్టించుకోని అధికారులు



బాధితుడిని విచారిస్తున్న వైద్యాధికారులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్ సిబ్బంది వైద్యానికి డబ్బులు వసూలు చేయడం చర్చనీయాంశంగా మారింది. డీఎంహెచ్‌వో నుంచి డీసీహెచ్‌కు అప్‌గ్రేడ్ అయినా పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో అవుట్ సోర్సింగ్ సిబ్బందితో రోగులకు సేవలందించాల్సి వస్తోంది. ఉచితంగా వైద్య సేవలు అందించాల్సిన అవుట్ సోర్సింగ్ సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తుండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. బయట చెబితే సేవలందించరని భయపడి ఎంతోకొంత ముట్టజెప్పుతున్నారు. అవుట్‌సోర్సింగ్ సిబ్బందిలో గ్రూపుల వ్యవహారంతో డబ్బులు తీసుకుంటున్న వీడియో ఇటీవల వైరల్‌గా మారింది.

వారితోనే ఇబ్బందులు..

సివిల్ ఆస్పత్రిలో ముగ్గురు వైద్యులు, 12 మంది రెగ్యులర్ స్టాఫ్, ఒక ఫార్మాసిస్టు ఉన్నారు. 14 మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బందిలో ఐదుగురు స్వీపర్లు, నలుగురు డ్రెస్సింగ్ సిబ్బంది, ఒకరు సూపర్‌వైజర్, ముగ్గురు సెక్యూరిటీ గార్డులు, ఒకరు పెస్ట్ కంట్రోలర్ ఉన్నారు. చికిత్స కోసం వచ్చిన తులసీరాంను రూ.100 ఇస్తేనే డ్రెస్సింగ్ చేస్తానని అవుట్ సోర్సింగ్ సిబ్బంది డిమాండ్ చేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కాగా డ్రెస్సింగ్ సిబ్బందిని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ తొలగించినట్లు తెలిపారు. జిల్లా వైద్యులు కోటేశ్వర్‌రావు ఈ నెల 16న బాధితుడిని విచారణ చేశారు. ప్రస్తుతం డ్రెస్సింగ్ సిబ్బంది లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. రికార్డు ప్రకారం పద్నాలుగు మంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఉండాల్సి ఉండగా 17మందిని నియమించినట్లు తెలుస్తోంది. ముగ్గురిని ఎక్కువగా నియమించుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక కిందిస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

విధుల నుంచి తొలగించాం



పేషెంట్ కేర్ టేకర్ సిబ్బంది డబ్బులు అడుగుతున్నారని తెలియడంతో కొంత మంది సిబ్బందిని విధుల నుంచి తొలగించాం. అవుట్‌సోర్సింగ్ సిబ్బంది మరికొంతమందిని నియమిస్తాం. త్వరలోనే సిబ్బందిని ఏర్పాటు చేసి రోగులకు పూర్తి సేవలు అందిస్తాం. ఆసుపత్రిలో ఎవరైనా రోగుల వద్ద డబ్బులు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, ఆసుపత్రి సూపరింటెండెంట్, లక్సెట్టిపేట

పకడ్బందీగా భూ సేకరణ పనులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

నస్పూర్: అభివృద్ధి పనుల్లో భాగంగా సింగరేణి సంస్థ పరిధిలోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి, ఏరియాల్లో భూ సేకరణ పనులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, సింగరేణి డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ పా ఎన్.బలరాంతో కలిసి సింగరేణి అధికారులతో భూ సేకరణ సంబంధిత అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ భూ సేకరణ పనులను ఎలాంటి అవకతవకలు లేకుండా నిర్వహించాలని తెలిపారు. సింగరేణి సంస్థ డైరెక్టర్ ఫైనాన్స్ అండ్‌పా బలరాం మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉపరితల గనులకు సంబంధించిన అన్ని పనులకు అనుమతి తీసుకుని భూ సేకరణ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్, మందమర్రి ఏరియా జీఎంలు బి.సంజీవరెడ్డి, మోహన్‌రెడ్డి, ఎస్టేట్స్ జనరల్ మేనేజర్ సురేశ్, బెల్లంపల్లి ఏరియా ఇంచార్జి జనరల్ మేనేజర్ నరేందర్, ఎస్టేట్స్ అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు మరో అవకాశం

- ఈ నెల 31వరకు గడువు పెంపు
- 2106 మంది విద్యార్థుల ప్రవేశాలు

ప్రభుత్వ జూనియర్ కళాశాల	ప్రవేశం పొందిన విద్యార్థులు
మంచిర్యాల	460
మందమర్రి	164
కాసిపేట	110
చెన్నూర్	167
బెల్లంపల్లి(గర్ల్స్)	205
బెల్లంపల్లి	396
జన్నారం	184
దండేపల్లి	102
లక్సెట్టిపేట	196



మంచిర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల ఉన్నత విద్యకు కీలకమైన ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు గడువు ఈ నెల 31వరకు పొడగిస్తూ ఇంటర్‌బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ ఒకటి నుంచి కళాశాలలు పునః ప్రారంభం కాగా పదో తరగతి ఫలితాలు రావడంతోనే ప్రవేశాల నమోదు ప్రక్రియ మొదలైంది. జూలై 31వరకు తుది గడువు విధించారు. ఆ తర్వాత మరో 16రోజులు పొడగించారు. విద్యార్థులకు ఆన్‌లైన్‌పై అవగాహన లేకపోవడం.. ఓటీపీ, ఇతర అంశాలు.. కారణాలు ఏవైనా గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ప్రవేశాల నమోదులో కాస్త వెనుకబడింది. దీంతో విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా మూడోసారి గడువు పొడగించింది.

జిల్లాలో పది ప్రభుత్వ జూనియర్ కళాశాలలు..

జిల్లాలో పది ప్రభుత్వ కళాశాలలు ఉండగా.. వీటిలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, కొన్ని వృత్తి విద్య కోర్సులు ఉన్నాయి. ఒక్కో గ్రూపులో 40 మంది విద్యార్థులకు ప్రవేశాలున్నాయి. కళాశాలలకు నేరుగా వచ్చే విద్యార్థుల నుంచి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకుని అక్కడికక్కడే ఆన్‌లైన్ నమోదు చేస్తున్నారు. గత ఏడాది 2,300 మంది కళాశాలల్లో ప్రవేశాలు పొందగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 2,106 మంది చేరారు. వీరిలో 1,408 మంది జనరల్, 698 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు. గతేడాది కంటే మరో 300 మందికి అదనంగా ప్రవేశాలు కల్పించాలని అధికారులు నిర్ణయించారు. ఈ లెక్కన దాదాపు 400 విద్యార్థులు చేరాల్సి ఉంది.

మధ్యాహ్నం భోజనం లేనట్లే..?

ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని ఇప్పటికే సీఎం ఆదేశించడంతో ఆకలి బాధ తీరుతుందని భావించిన విద్యార్థులకు నిరాశే ఎదురవుతోంది. మూడేళ్లుగా మధ్యాహ్న భోజనం అమలుపై ఊరిస్తునే ఉన్నారు. మధ్యాహ్న భోజనం ప్రవేశపెడితే ప్రవేశాలతోపాటు ఉత్తీర్ణత శాతం పెరుగుతుంది. రెండు పూటల కళాశాలల తరగతులకు హాజరయ్యే వీలుంటుంది. వసతి సౌకర్యాలు లేకపోయినా మధ్యాహ్న భోజనం అమలు చేస్తే విద్యార్థులకు సౌకర్యంగా మారి ప్రవేశాల సంఖ్య ఊపందుకునే అవకాశాలున్నాయి.

నత్తనడకన..

ప్రవేశాలు నత్తనడకన సాగడానికి అనేక కారణాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఇదివరకు ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశాలకు ఇంటర్మీడియెట్ బోర్డు దాదాపు 30 రోజుల ముందుగా లాగిన్ ఇచ్చేది. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల నమోదు చేసిన తర్వాత ప్రైవేట్ కళాశాలలకు అనుమతి ఇచ్చేవారు. ప్రస్తుతం అందరికీ ఒకేసారి ఇవ్వడంతో ప్రైవేట్ సంస్థలు ప్రకటనలతో విద్యార్థులను ఆకట్టుకుంటున్నాయి. వసతితో కూడిన ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీ, గురుకులాల వల్ల విద్యార్థులు అటువైపు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ విద్యాసంవత్సరంలో రెండు కేజీబీవీల్లో ఇంటర్ అమలు చేయడం.. బీసీ గురుకులాలు ఏర్పాటు చేయడం కూడా కళాశాల్లో ప్రవేశాలకు తడబడినట్లు తెలుస్తోంది. ఐటీఐ, పాలిటెక్నిక్ తదితర కోర్సుల్లో సీటు రాని విద్యార్థులు ప్రవేశాలు పొందే వీలుందని ఇంటర్ విద్య అధికారులు భావిస్తున్నారు. దీంతో అడ్మిషన్ల సంఖ్య పెరిగే అవకాశాలు లేకపోలేదు. ఆసక్తి గల విద్యార్థులు www. tsbie. cgg. gov. in లో నమోదు చేసుకోవచ్చు.

అడ్మిషన్లు పెంచేందుకు చర్యలు

ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు చర్యలు చేపట్టాం. ఇదివరకు కళాశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై విస్తృత ప్రచారం చేపట్టాం. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం అడ్మిషన్ల సంఖ్య పెంచాలని ఆయా కళాశాలల ప్రిన్సిపాల్‌లకు ఆదేశాలిచ్చాం.

– శైలజ, డీఐఈవో, మంచిర్యాల

భయం గుప్పిట్లో విధులు

- శిథిలావస్థలో డీపీవో కార్యాలయ భవనం
- ఊడుతున్న పై పెచ్చులు.. దూరుతున్న పాములు
- సమీకృత కలెక్టరేట్‌లో సిద్ధం కాని కార్యాలయం



పైపెచ్చులు ఊడిన జూనియర్ అసిస్టెంట్ గది



కలెక్టరేట్‌లో డీపీఓ కార్యాలయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా కేంద్రంలోని హమాలీవాడలో ఉన్న జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో సిబ్బంది భయం గుప్పిట్లో విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. మొదట్లో డీపీవో కార్యాలయం హాజీపూర్ మండలం గుడిపేట పునరావాస కాలనీలో ఉండేది. రెండేళ్ల క్రితం అటవీ అటవీశాఖ కార్యాలయాల సముదాయంలో భవనంలోకి తరలించారు. పాత భవనం కావడంతో శిథిలావస్థకు చేరింది. డీపీవో, డీఎల్‌పీవోలు, ఏవో, కార్యాలయ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. డీపీవో చాంబర్‌లోనే కాకుండా కంప్యూటర్ ఆపరేటర్, జూనియర్ అసిస్టెంట్లు విధులు నిర్వర్తిస్తున్న సమయంలోనే పై పెచ్చులు ఊడి కిందపడ్డాయి. తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. కార్యాలయం చుట్టూ చెట్లు, పిచ్చిపొదలు ఉండడంతో పాములు సంచరిస్తున్నాయి. విధులు నిర్వర్తిస్తున్న సమయంలోనే పాములు టేబుళ్ల వద్దకు వస్తుండడంతో భయం భయంగా పరుగులు పెట్టిన సందర్భాలు సైతం ఉన్నాయి. ప్రత్యేకంగా పాములు పట్టుకునే వారిని పిలిపించి ఇప్పటివరకు దాదాపు పది పాములను పట్టుకుని అటవీ ప్రాంతాల్లో వదిలిపెట్టారు.

సిద్ధం కాని కార్యాలయం

నస్పూర్ మున్సిపాలిటీలో ఇప్పటికే సమీకృత కలెక్టరేట్ నిర్మించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 9న సీఎం కేసీఆర్ ప్రారంభించారు. అప్పటి నుంచి ఒక్కో శాఖ కార్యాలయాన్ని తరలిస్తూ వస్తున్నారు. 38శాఖలు ఉండగా ఇప్పటివరకు 12శాఖల కార్యాలయాలు మాత్రమే కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఇప్పటికే అన్ని శాఖల జిల్లా కార్యాలయాల తరలింపు పూర్తి చేయాల్సి ఉన్నా నత్తనడకన సాగుతోంది. ఒక్కో శాఖ జిల్లా కార్యాలయం తరలింపు ఆలస్యం అవుతుండగా.. భవన నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ పనుల నిర్వహణలో జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే డీపీవో కార్యాలయం తరలింపు ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండేది. కానీ కార్యాలయానికి కేటాయించిన హాల్‌లో ఫర్నిచర్, విద్యుత్ తదితర పనులు పూర్తి కాలేదు. ఈ నెల చివరి వారంలోగా తరలింపు పూర్తిగా చేపడుతామని డీపీవో వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

'వర్గీకరణ బిల్లుపై రేవంత్ ఎందుకు మాట్లాడడం లేదు'



మాట్లాడుతున్న నాయకులు

బెల్లంపల్లి: ఎస్సీ వర్గీకరణ బిల్లుపై పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎందుకు మాట్లాడడం లేదో చెప్పాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ చెన్నూరి సమ్మయ్య అన్నారు. గురువారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ కోసం 26 ఏళ్ల నుంచి పోరాడుతున్న మంద కృష్ణపై రేవంత్‌రెడ్డి విమర్శలు చేయడాన్ని తప్పు పట్టారు. మాదిగలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశ పెట్టడానికి కేంద్రంపై రేవంత్‌రెడ్డి ఒత్తిడి తీసుకు రావాలని డిమాండ్ చేశారు. ఉత్త మాటలతో మొసలి కన్నీరు కార్చొద్దని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు రత్నం ఐలయ్య, ఎల్లయ్య, కుశనపల్లి రాజలింగు, శేఖర్, రామకృష్ణ, శంకర్, అరుణ్‌కుమార్, రఘు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధి పనులు వేగవంతం

- జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్



విద్యార్థులతో మాట్లాడుతున్న రాహుల్, డీఈవో

బెల్లంపల్లి: మన ఊరు–మన బడి పథకంలో భాగంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. గురువారం మన ఊరు–మన బడి పథకానికి ఎంపికైన మండలంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, చంద్రవెల్లి జెడ్పీ హైస్కూల్, బుధాకలాన్, ఆకెనపల్లి పాఠశాలలను సందర్శించి ఆయా పాఠశాలల్లో పనులను పర్యవేక్షించారు. అంతరాయం లేకుండా పనులు చేపట్టాలని, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ప్రధానోపాధ్యాయులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల రెండ్రోజుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. పలు సూచలనలు చేశారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

18 ఏళ్లు నిండిన విద్యార్థిని, విద్యార్థులు ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకమైందని అన్నారు. వయోజనులు ఓటు కలిగి ఉండి వినియోగించుకోవాలని కోరారు. ఓటు ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ యాదయ్య, ఆర్డీవో కాసబోయిన సురేష్, ఎంపీడీవో రాజేందర్, తహసీల్దార్ బి.సుధాకర్, మున్సిపల్ కమిషనర్ కె.సమ్మయ్య, ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి, డీఈ శ్రీనివాస్, ఏఈలు విజయ్, పరంజ్యోతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇరువర్గాలపై కేసు నమోదు

భీమిని: కన్నెపల్లి మండలం మోతుకుపల్లి శివారులోని రెండెకరాల భూమి కేసులో ఇరువర్గాలపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. కన్నెపల్లి గ్రామానికి చెందిన కామెర శంకర్, గురుండ్ల రామకృష్ణ, భుజంగంపై సుల్తానాబాద్ గ్రామానికి చెందిన మైదంశెట్టి అంజయ్య, అతని భార్య భూమిని ఆక్రమించుకుంటున్నారని తెలిసిన కన్నెపల్లి గ్రామస్తులు వారి వద్దకు వెళ్లి అడగగా మాటామాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయగా ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా తరలిస్తున్న యువకుడు అరెస్టు



పోలీసుల అదుపులో నిందితుడు

బెల్లంపల్లి: గుడుంబా తరలిస్తున్న ఓ యువకుడిని గురువారం అరెస్టు చేసినట్లు తాళ్లగురిజాల ఎస్సై నరేష్ తెలిపారు. పెర్కపల్లి రోడ్డుపై పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన లంబాడితండాకు చెందిన ఇస్లావత్ రాజేశ్ బైక్‌ను ఆపి తనిఖీ చేయగా ఆరు లీటర్ల గుడుంబా పట్టుబడినట్లు ఎస్సై తెలిపారు. వేరే వ్యక్తి వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నట్లు నిందితుడు పేర్కొన్నాడు. నాటుసారాను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గృహహింస కేసులో భర్తకు ఏడాది జైలు

బెల్లంపల్లి: కట్టుకున్న భార్యను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేసిన భర్తకు జడ్జి జైలుశిక్ష విధించినట్లు బెల్లంపల్లి టూటౌన్ ఎస్సై ఎస్.రవికుమార్ తెలిపారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలోని సుభాష్‌నగర్ బస్తీకి చెందిన షమీనా భర్త ఎండి ముస్తాఫాపాషా అదనపు వరకట్నం తీసుకు రావాలని వేధిస్తున్నాడని 2011లో టూటౌన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి స్టేషన్ హౌజ్ ఆఫీసర్ రవీందర్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టు కానిస్టేబుల్ ఎండి రహీమొద్దీన్ సాక్షులను ప్రవేశ పెట్టగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అజయ్‌కుమార్ వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో గురువారం బెల్లంపల్లి జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్.ముకేష్ నిందితునికి ఏడాది సాధారణ జైలు, రూ.3 వేల జరిమానా విధిస్తూ తీర్పుచెప్పినట్లు ఎస్సై తెలిపారు.

వదినను చంపుతానని బెదిరించిన మరిదికి జైలుశిక్ష

బెల్లంపల్లి: ఇంట్లోకి వెళ్లకుండా వదినను అడ్డగించి చంపుతానని బెదిరించిన కేసులో మరిదికి బెల్లంపల్లి జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ గురువారం నెలరోజుల సాధారణ జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధించినట్లు బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య తెలిపారు. పట్టణంలోని బజారు ఏరియాకు చెందిన హరికిషన్‌సార్డా కొంతకాలం క్రితం మృతి చెందాడు. ఆయన మరణాంతరం ఆస్తి కోసం హరికిషన్ సార్డా భార్య నిర్మల సార్డాను మరిది బాలకిషన్‌సార్డా వేధింపులకు గురి చేయడం మొదలు పెట్టాడు. దీనిపై బాధితురాలు 2016లో బాలకిషన్‌సార్డా పై వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై గంగరాజ గౌడ్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్‌దాఖలు చేశాడు. ఆరుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా ఏపీపీ అజయ్‌కుమార్ వాదనలు వినిపించారు. నేరం రుజువుకావడంతో జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్.ముకేష్ నిందితుడు బాలకిషన్ సార్డాకు నెల రోజుల సాధారణ జైలు, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్‌హెచ్‌ఓ శంకరయ్య తెలిపారు.

అక్రమంగా నిర్మించిన ప్రహరీ కూల్చివేత



కూల్చి వేయిస్తున్న అధికారులు

నస్పూర్: పట్టణ పరిధిలోని 11 వవార్డు ఎఫ్‌సీఐ కాలనీలో రోడ్డుపై అక్రమంగా నిర్మించిన రెడిమేడ్ ప్రహరీని గురువారం మున్సిపల్ అధికారులు బ్లేడు ట్రాక్టర్‌తో కూల్చి వేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ రమేశ్ మాట్లాడుతూ పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమ నిర్మాణాలు, కట్టడాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

‘అభయ’మిస్తున్నారు..!

- ప్రతీ ఆటోకు యూనిక్ నంబర్
- అందుబాటులోకి ప్రత్యేకయాప్
- డ్రైవర్ సీటు వెనుక క్యూఆర్ కోడ్
- స్కాన్ చేస్తే వివరాలు లభ్యం
- ఆపదొస్తే పోలీసులకు మెసేజ్
- మహిళల భద్రత కోసమే ఏర్పాటు



మంచిర్యాలలో ఆటోలకు క్యూఆర్ కోడ్‌పై వివరిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

మంచిర్యాలక్రైం: మహిళలు ఒంటరిగా ప్రయాణం చేయాలంటే భయపడుతున్న ఈ రోజుల్లో మనం జీవిస్తున్నాం.. ఎవరిని నమ్మాలో.. ఎవరిని నమ్మకూడదో తెలియడం లేదు. సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని ప్రచారం చేస్తున్నారు. పట్టణాల్లో ఒక కాలనీ నుంచి మరో కాలనీకి, బస్సులు వెళ్లని ఏ ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నా ఆటోలు తప్పనిసరి అవుతున్నాయి. గతంలో కొందరు ఆటో డ్రైవర్ల చెడు ప్రవర్తనతో ప్రయాణికులు వారిపై సదాభిప్రాయం కోల్పోయారు. దీంతో ఆటోల్లో ప్రయాణించే మహిళలకు భద్రత కల్పించేందుకు రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని ఆటోలకు అభయ అప్లికేషన్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇందులో భాగంగా ఈ నెల 10న కమిషనరేట్ పరిధిలోని వెయ్యి ఆటోలకు క్యూఆర్ కోడ్/యునిక్ నంబర్లు ఇచ్చారు.

ఆకతాయిలకు అడ్డుకట్ట వేసేందుకే..

ఆకతాయి ఆటో డ్రైవర్ల ఆగడాలను అరికట్టేందుకు అభయ అప్లికేషన్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ప్రయాణికులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేందుకు ప్రతీ ఆటోలో క్యూర్ కోడ్/యునిక్ నంబర్‌ను ఏర్పాటు చేశారు. క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేసిన ప్రతీ ఆటోలో ప్రయాణం చేస్తున్న వారికి ఎలాంటి ఆపద కలిగినా, ఇబ్బందులెదురైనా వెంటనే యూనిక్ నంబర్‌ను స్కాన్ చేస్తే చాలు ఆటోకు సంబంధించిన వివరాలు లభ్యమవుతాయి. ఆటో ఎక్కడిది, ఎవరిది, డ్రైవర్ ఎవరనే పూర్తి వివరాలు తెలుస్తాయి. దీంతో ఆటో డ్రైవర్ తప్పుగా ప్రవర్తించినా, ఇబ్బందులకు గురి చేసినా, మద్యం సేవించి వాహనం నడిపినా, ఆటోను దారి తప్పించి తీసుకు వెళ్లినా ఈజీగా దొరికిపోతాడు. ప్రయాణికులు ఆటో ఎక్కగానే వెంటనే డ్రైవర్ సీటు వెనకాల పోలీసులు ఏర్పాటు చేసిన క్యూర్ కోడ్‌ను సెల్‌ఫోన్‌తో స్కాన్ చేయాలి. దీంతో ఆటోకు సంబంధించిన వివరాలు కనిపిస్తాయి. అందులో పోలీసులకు సమాచారం ఇవ్వాలా.. అనే ఆప్షన్ కూడా ఉంటుంది. ఎలాంటి ఇబ్బందులెదురైనా వెంటనే వారి స్మార్ట్‌ఫోన్‌లో అభయ అప్లికేషన్ ద్వారా ప్రయాణిస్తున్న లైవ్ లొకేషన్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు చేరుతుంది. దీంతో క్షణాల్లో సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందుతుంది. అక్కడి పోలీసులు లైవ్ లొకేషన్ ద్వారా ఆటోను ట్రేస్ చేసి పట్టుకుంటారు.

క్యూ ఆర్ కోడ్/యూనిక్ నంబర్

గతంలో ఆటోలో ప్రయాణించినప్పుడు ఏదైనా ప్రమాదం జరిగినా, అందులో విలువైన వస్తువులు మర్చిపోయినా, ఏదైనా నేరం జరిగినా సంబంధిత ఆటోను పట్టుకునేందుకు పోలీసులు నానా తంటాలు పడేవారు. సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైనప్పటికీ క్లారిటీ లేక పట్టుకోవడం కొంత కష్టమయ్యేది. ప్రస్తుతం అభయ అప్లికేషన్ ద్వారా ఆటోలో ప్రయాణించేవారికి పూర్తి భద్రత ఉంటుంది. దూరప్రాంతాల నుంచి రాత్రి సమయంలో రైళ్లు, బస్సుల్లో వచ్చినవారు ఆటోల ద్వారానే ఇంటికి వెళ్లాల్సి ఉంటుంది. జిల్లాలో రోజుకు సుమారు వేలాది మంది రాత్రి వేళల్లో రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి సమయంలో మహిళలకు రాత్రి వేళల్లో అభయ్ అప్లికేషన్ ద్వారా పూర్తిస్థాయిలో భద్రత ఉంటుంది.

మహిళల భద్రత కోసమే..



ఆటోల్లో ప్రయాణించే మహిళలకు భద్రత కల్పించేందుకే అభయ్ అప్లికేషన్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చాం. ఆటోల్లో ప్రయాణించేవారు డ్రైవర్ సీటు వెనుకాల ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్/యూనిక్ నంబర్‌ను స్కాన్ చేస్తే ప్రయాణిస్తున్న వాహనానికి సంబంధించిన పూర్తి వివరాలు మొబైల్ స్క్రీన్‌పై కనిపిస్తాయి. ఏదైనా అపాయం ఎదురైతే పోలీసులకు సమాచారం వెళ్తుంది. ప్రయాణిస్తున్న వాహనం లైవ్ లొకేషన్ ద్వారా పోలీసులు క్షణాల్లో వాహనాన్ని పట్టుకుంటారు. మహిళలు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి. కమిషనరేట్ పరిధిలోని ఆటోలన్నింటికీ క్యూఆర్ కోడ్ అందజేస్తున్నాం. – రెమా రాజేశ్వరి, రామగుండం సీపీ

‘చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలి’



మాట్లాడుతున్న శ్రీనివాస్

నెన్నెల(బెల్లంపల్లి): కోణంపేట గ్రామ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తలపెట్టిన ‘చలో కలెక్టరేట్ పాదయాత్ర’ విజయవంతం చేయాలని కార్యక్రమ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాంటెంకి శ్రీనివాస్ కోరారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అటవీ అనుమతులు లేవన్న నెపంతో గ్రామానికి రోడ్డు నిర్మించడం లేదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో కోణంపేట, పాటి, బోగంపల్లి గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజాసమస్యల కోసం చేస్తున్న ఈ పాదయాత్రలో వేమనపల్లి, కన్నెపల్లి, నెన్నెల మండలాల ప్రజలు పాల్గొంటున్నారని ఈ పాదయాత్రను అందరూ కలిసి విజయవంతం చేయాలని కోరారు. ఉదయం 9 గంటలకు ఈ యాత్ర ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి



శ్రీరాంపూర్‌ని ఓసీని పరిశీలిస్తున్న అధికారులు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియా ఉపరితల గని ఉద్యోగులు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధిస్తూ నిర్దేశిత లక్ష్యాన్ని సాధించాలని సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ జి.వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన ఏరియా జీఎం సంజీవరెడ్డితో కలిసి ఉపరితల గని పని ప్రదేశాలను, ఓబీ కాంట్రాక్టు కంపెనీ క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. ఓబీ కాంట్రాక్టు కంపెనీ వారు రోజువారి నిర్దేశిత లక్ష్యాన్ని సాధించడానికి అన్ని ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకెళ్లాలన్నారు. కొత్త కాంట్రాక్టు కంపెని వారు ఓబీ ఉత్పత్తి పనులను త్వరగా ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి పురుషోత్తంరెడ్డి, డీజీఎం సివిల్ శివరావు, సర్వే అధికారి సంపత్ పాల్గొన్నారు.

బ్యాంకు అధికారుల తీరుపై మహిళ నిరసన

- తీసుకున్న నగదు చెల్లించినా బంగారం ఇవ్వడంలేదని ఆరోపణ



మాట్లాడుతున్న మహిళ

ఆసిఫాబాద్: బంగారం బ్యాంకులో పెట్టి తీసుకున్న రుణం తిరిగి చెల్లించినా తన బంగారం తనకు ఇవ్వడంలేదని మండలంలోని చిర్రకుంటకు చెందిన స్వయంసహాయక సంఘం మహిళ కామెర సునంద గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది. ఉదయం నుండి సాయంత్రం వరకు అక్కడే ఉన్నా బ్యాంకు అధికారులు తనను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారని వాపోయింది. రెండేళ్ల క్రితం నాలుగున్నర తులాల బంగారం బ్యాంకులో పెట్టి 1.20 లక్షలు తీసుకోగా వడ్డీతో సహా రూ.1.31 లక్షలు బుధవారం తన బ్యాంకు అకౌంట్ ద్వారా చెల్లించానని తెలిపింది. తన బంగారం తిరిగి ఇవ్వాలని రెండు రోజులుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయమై బ్యాంకు మేనేజర్ రవికుమార్‌ను వివరణ కోరగా సదరు మహిళతో పాటు మరో ముగ్గురు మహిళలు జిల్లా కేంద్రంలో డోంగ్రే సూపర్‌మార్కెట్ నిర్వహిస్తూ రూ.4 లక్షలు రుణం తీసుకున్నారని, రెగ్యులర్‌గా ఈఎంఐ చెల్లించక పోవడంతో ఎస్‌పీఏ కింద నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. ఈ క్రమంలో సదరు మహిళ బంగారం తిరిగి ఇవ్వలేదన్నారు. దీనిపై బ్యాంకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

జీపీ భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

- అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో చేపట్టిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. గురువారం నస్పూర్‌లో గల సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, మిషన్ భగీరథ ఈఈ అంజన్‌రావులతో కలిసి గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం, మన ఊరు–మన బడి, హరితహారంలో కోటి మొక్కలు, వైకుంఠధామాలలో నీరు, విద్యుత్ సౌకర్యాల అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఊరు–మన బడి కార్యక్రమం మొదటి విడతలో భాగంగా జిల్లాలో ఎంపికైన 248 పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయడంతో పాటు మిషన్ భగీరథ పథకం కింద ప్రతి పాఠశాలకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధుల సమన్వయంతో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ విజయవంతం చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు జేఈఈ మెయిన్స్–2023 రాసి అర్హత కలిగిన వారికి ఐఐటీ అడ్వాన్స్‌డ్ ఎంట్రన్స్‌కు లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ రీజినల్ కోఆర్డినేటర్ స్వరూపరాణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలుర కోసం టీటీడబ్ల్యూఆర్ ఐఐటీ స్టడీ సెంటర్, రాజేంద్ర నగర్, బాలికల కోసం టీఎస్‌డబ్ల్యూఆర్ సీవోఈ గౌలిదొడ్డి, హైదరాబాద్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. www. tgtwgurukulam. telangana. gov. in, www. tswreis. ac. in వెబ్‌సైట్‌ల నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ఆర్సీవో కార్యాలయంలో వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు రుసుం రూ. 200లను సెక్రెటరీ టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్, హైదరాబాద్ గానీ సెక్రటరీ టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్, హైదరాబాద్ పేరున డీడీ తీసి ఈ నెల 19 లోగా దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

బాలపురస్కార్‌కు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలటౌన్: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్–2024 కోసం అర్హత కలిగిన బాలబాలికల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కె.చిన్నయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ధైర్య సాహసాలు, ఆటలు, సంఘసేవ, సైన్స్, టెక్నాలజీ, పర్యావరణం, ఆర్ట్, కల్చరల్, ఇతర రంగాల్లో ఆవిష్కరణలను చేసి, జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బాలబాలికలకు అందించే ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ మేరకు నామినేషన్లను ఆన్‌లైన్‌లో http:// awards. gov. in/వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 31లోగా సమర్పించాలన్నారు. అత్యవసర సమయాల్లో ధైర్య సాహసాలు ప్రదర్శించిన వారిని చైల్డ్ బ్రేవరి అవార్డు, ఇతర రంగాల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన బాలలకు చైల్డ్ ఎక్స్‌లెన్స్ అవార్డును అందించడం జరుగుతుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తు ప్రతి, డాక్యుమెంట్ల జిరాక్స్ ప్రతులను జతచేసి జిల్లా కేంద్రంలోని జిల్లా సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో గడువులోగా అందించాలని, ఇతర వివరాలకు 9441506519 నంబరులో సంప్రదించాలని సూచించారు.

పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్య

గుడిహత్నూర్(బోథ్): పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఇమ్రాన్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన నాగర్‌గోజే డిగంబర్ (43) తనకున్న నాలుగెకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల తన సోదరుడు దత్తా వద్ద నుంచి ఎకరా పొలాన్ని రూ.10లక్షలు వెచ్చించి కొనుగోలు చేశాడు. అతనికి ఇవ్వాల్సిన డబ్బులు సకాలంలో అందకపోవడంతో మానసిక ఒత్తిడికి గురయ్యాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఇంటికివచ్చి కుటుంబ సభ్యులతో చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

పూలాజీ బాబా జయంతి ఘనంగా నిర్వహించాలి


- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



మాట్లాడుతున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

ఆసిఫాబాద్: జైనూర్ మండలం పాట్నాపూర్‌లోని సిద్ధేశ్వర సంస్థాన్‌లో ఈ నెల 30న పూలాజీబాబా జయంతి ఘనంగా నిర్వహించాలని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో పూలాజీ బాబా జయంతి వేడుకల నిర్వహణపై గురువారం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఉత్సవాలకు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భోజనం, తాగునీరు, రవాణా, పారిశుధ్య ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు, కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో గిరిజన, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్యం వికటించి బాలుడు మృతి



ఆస్పత్రి ఎదుట గుమిగూడిన బంధువులు

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యుల ఆందోళన
- ప్రైవేట్ ఆస్పత్రి ముందు ఉద్రిక్తత
- ఎట్టకేలకు సద్దుమణిగిన వివాదం
- కేసు నమోదు చేసిన పోలీసులు



సాకేత్ (ఫైల్)

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం వికటించి బాలుడు మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..దహెగాం మండలం హేటిగూడ గ్రామానికి చెందిన ఎస్.ఓదెలు–శ్రీదేవి దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఎస్.సాకేత్ (09) సంతానం. కుమారుడు దహెగాం మండలం లగ్గాంలోని సెయింట్ జోసఫ్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. బుధవారం రాత్రి సాకేత్‌కు జ్వరం రావడంతో తండ్రి గురువారం తన ద్విచక్ర వాహనంపై కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యుడు యాంటీబయాటిక్ ఇంజక్షన్ ఇవ్వాలని సూచించడంతో ఏఎస్ఎం బాలుడికి ఇంజక్షన్ ఇచ్చే క్రమంలో వాంతి చేసుకుని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బంధువులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎందుట ఆందోళనకు దిగారు. వైద్యుడి నిర్లక్ష్యం కారణంగానే తన కుమారుడు మృత్యువాత పడ్డాడని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణ సీఐ బుద్దే స్వామి, దహెగాం ఎస్సై సనత్‌రెడ్డి, పట్టణ ఎస్సైలు కల్యాణ్, అంజయ్య సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వైద్యున్ని సంప్రదించగా బాలుడి శరీరంలోని షుగర్ లెవల్ తగ్గిపోవడంతోనే మృతి చెందినట్లు వివరించాడు. పోలీసుల హామీతో ఆందోళన విరమించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ బుద్దే స్వామి వివరించారు.

‘ఆదర్శ’ విద్యార్థినికి అస్వస్థత

- అందుబాటులో లేని వైద్య సిబ్బంది..
- 108లో చెన్నూర్‌కు తరలింపు



చికిత్స పొందుతున్న విద్యార్థిని

కోటపల్లి(చెన్నూర్): ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో మండల వాసులకు వైద్యసేవలు అందడం లేదు. కోటపల్లి మండల కేంద్రం మోడల్ స్కూల్‌కు చెందిన ఇంటర్ విద్యార్థిని సిందుజా గురువారం స్పృహతప్పి కిందపడి పోవడంతో సిబ్బంది వెంటనే ఆటోలో కోటపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో 108లో చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. 24 గంటలు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాల్సిన సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

గుడిహత్నూర్(బోథ్): మండలంలోని పూనగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు కాగా ఒకరి పరిస్థితి ఆందోళన కరంగా ఉన్నట్లు స్థానికులు, పోలీసులు తెలిపారు. మండల కేంద్రంలోని జవహర్‌నగర్‌కు చెందిన గెడం మారుతి చింతగూడకు చెందిన ఓ ట్రాక్టర్ యజమాని వద్ద కూలీ పని చేస్తున్నాడు. తన స్నేహితుడు ఇచ్చోడ మండలం తలమద్రికి చెందిన కొడప పవన్‌తో కలిసి గురువారం తన అత్తగారి ఊరైన ఇంద్రవెల్లి మండలంలోని మెండపల్లికి బైక్‌పై బయలు దేరారు. తోషం సమీపంలో నిలిచి ఉన్న బొలెరో వాహనాన్ని వెనుక నుండి ఢీకొట్టారు. ఘటనలో పవన్‌కు తీవ్రంగా మారుతికి స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

‘జనక్‌ప్రసాద్‌కు రామగుండం అసెంబ్లీ టికెట్ ఇవ్వాలి’

మందమర్రిరూరల్(చెన్నూర్): ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్‌కు కాంగ్రెస్ పార్టీ నుంచి రామగుండం అసెంబ్లీ టికెట్ ఇవ్వాలని ఐఎన్టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సిద్దంశెట్టి రాజమౌళి కోరారు. గురువారం ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించాలంటే యూనియన్ తరుపున జనక్‌ప్రసాద్‌కు సీటు కేటాయించి ప్రోత్సహించాలన్నారు. ఇదివరకే కాంగ్రెస్ చీఫ్ రాహుల్‌గాంధీ ఐఎన్టీయూసీకి సముచిత స్థానం కేటాయిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. సమావేశంలో ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి కాంపెల్లి సమ్మయ్య, నాయకులు దేవి భూమయ్య, రాంబాబు, నరేందర్, వెంకటస్వామి పాల్గొన్నారు.

‘గృహలక్ష్మి’ దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న డీపీవో

జన్నారం: గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా చేపట్టాలని డీపీవో వెంకటేశ్వర్‌రావు సూచించారు. జన్నారం మండలంలోని రోటిగూడలో గురువారం దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని త్వరగా పూర్తిచేసి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఆయన వెంట సర్పంచ్ విజయ, సిబ్బంది ఉన్నారు.